వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 156 మంగళవారం | 19 డిసెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5



## సన్న రకం ధాన్యానికి పెరిగిన డిమాండ్

రైస్ మిల్లులు, ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటున్న రైతులు

8లో



# ఎన్నాళ్లీ.. లీకేజీలు?

## రోడ్లపై పారుతున్న తాగు నీరు

వివరాలు 2లో..



- ప్రమాదాలకు కారణమవుతున్న గుంతలు
- గ్రేటర్ పరిధిలో లెక్కకు మించి లీకేజీలు
- పట్టించుకోని అధికారులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

ప్రజల గొంతు తడపాల్సిన తాగు నీరు వృథాగా పోతోంది. పైప్ లైన్ లీకేజీలతో ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. భూమికి చిల్లులు పడినట్లు ఎటు చూసినా ఈ లీకేజీలే దర్శనమిస్తున్నాయి. గ్రేటర్ పరిధిలో లెక్కకు మించి ఉన్న లీకేజీలను మరమ్మతు చేయలేక అధికారులు చేతులెత్తేశారు. అనేక ప్రాంతాల్లో పాత కాలపునాటి గేట్‌వాల్వ్‌లతో పరేషాన్ తప్పడం లేదు. వాల్వ్‌లు తిప్పగానే ఫౌంటెన్‌లను తలపించేలా నీరంతా బయటకొచ్చి రోడ్లపై పారుతోంది. దీంతో పలు ప్రాంతాల్లో నెలల తరబడి తాగునీరు అందక నగర ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. నగర ప్రజల అవసరాలను గుర్తించి పరిష్కార మార్గం చూపించాల్సిన మేయర్, డిప్యూటీ మేయర్లు కేవలం సమీక్ష సమావేశాలకే పరిమితమవుతున్నారన్న ప్రచారం సాగుతోంది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ ప్రతీ రోజు తాగునీటిని అందిస్తున్నట్లు ప్రకటించుకుంటున్న గ్రేటర్ పాలకవర్గం నగరంలోని లీకేజీలను అరికట్టి కనీసం రోజు విడిచి రోజైనా నీటిని సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్



8లో

## పనుల్లో వేగం పెంచండి

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

బల్దియా కమిషనర్‌తో కలిసి అభివృద్ధి పనులపై సమీక్ష



8లో..

## ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా దాసరి హరిచందన



2లో

## రూర్బన్ పనులు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

# ఎన్నాళ్లీ లీకేజీలు?



**రోడ్లపై పారుతున్న తాగు నీరు**
**ప్రమాదాలకు కారణమవుతున్న గుంతలు**
**గ్రేటర్ పరిధిలో లెక్కకు మించి లీకేజీలు**
**పట్టించుకోని అధికారులు**
**ప్రజలకు తప్పని ఇబ్బందులు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మానవాళి మనుగడ తాగు నీటి పైనే ఆధారపడి ఉంది. శుద్ధమైన జలం తాగడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. వీటన్నిటికీ మిషన్ భగీరథ పరిష్కారం చూసుతుంది. కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు రానే రావు. ఏడు పదుల వయసులో కూడా ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా జీవించవచ్చంటూ గ్రేటర్ వరంగల్ పాలకవర్గం మిషన్ భగీరథ పథకం ప్రారంభ సమయంలో ఊదరగొట్టారు. కోట్ల రూపాయలు వెచ్చించి పెద్ద పెద్ద ట్యాంకులను నిర్మించారు. గతంలో ఉన్న పైపుల స్థానంలోనే తిరిగి కొత్త పైప్ లైన్లను ఏర్పాటు చేశారు. కానీ లీకేజీలను అరికట్టడంలో మాత్రం బల్దియా అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పవచ్చు.

## కొత్త వింత..

కొత్త వింత..పాతొక రోత అన్న చందంగా నగరంలో తాగునీటి పరిస్థితి తయారైంది. బల్దియా అధికారులు కొత్త పైప్ లైన్ల ఏర్పాటుపై చూపిన శ్రద్ధ వాటి లీకేజీపై చూపకపోవడంతో నగరంలో శుద్ధ జలం అన్నది కళగానే మిగిలింది. నగరంలోని 66 డివిజన్లలో వందల సంఖ్యలో లీకేజీలు దర్శనమిస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. పర్సంటేజీలకు ఆశపడే కొత్త పైప్ లైన్ నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు ఆరోపణలున్నాయి. దీంతో నగర ప్రజలకు శుద్ధమైన తాగు నీరు అందించాలన్న లక్ష్యంతో కోట్ల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం అభాసు పాలవుతోంది. ఇంటింటికీ శుద్ధ జలం అన్నది వట్టిమాటగా మారింది.

## అయోమయం..

తాగునీటి పైపులైన్లు ఎప్పుడు పగిలిపోతాయో, వాటికి ఎప్పుడు మరమ్మత్తులు చేస్తారో ఎవరికి తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. లీకేజీ ద్వారా నెలల తరబడి తాగునీరు వృథాగా పోతున్న పట్టించుకునే వారే కరువయ్యారు. అనేక ప్రాంతాల్లో గేట్‌వాల్వ్‌లకు ఏళ్లతరబడి కనీస మరమ్మతులు లేక వాల్వ్‌లు తిప్పగానే నీరంతా బయటకొచ్చి రోడ్లపై పారుతోంది. పలుచోట్ల వాల్వ్‌ల వద్ద నల్లాలు వచ్చే సమయంలో చెరువులను తలపిస్తున్నాయి. నీటి సరఫరా నిలిచిపోయిన అనంతరం వాల్వ్‌ల వద్ద నిలిచిన నీరు కలుషితమై తిరిగి పైపుల్లోకి చెరుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రమై తాగునీటిని ప్రజలకు సరఫరా చేయాల్సిన అధికారులు తాగునీటి కలుషితంపై కనీస చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వాటర్ ట్యాంకుల వద్ద కూడా పరిస్థితి అధ్వానంగా మారింది.

## పైపులు వేశారు..

నగరంలోని అనేక ప్రాంతాల్లో మిషన్ భగీరథ పథకం అలంకార ప్రాయంగా మారింది. పలు ప్రాంతాల్లో పైప్ లైన్ నిర్మాణ పనులను పూర్తి చేసినప్పటికీ ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇవ్వనేలేదు. మరికొన్నికాలనీలకు పైపులు వేశారు తప్పా, నీటి సరఫరాను మాత్రం మర్చి పోయారు. దీనికి ప్రధాన కారణం పైపులైన్ల మరమ్మతులు చేయించలేక గ్రేటర్ అధికారులు చేతులెత్తేశారు. అయితే లీకేజీలను అరికట్టాల్సిన బల్దియా ఇంజనీరింగ్ విభాగం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి.

## పాలకవర్గం నిర్లక్ష్యం..

నగరంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఏర్పడుతున్న పైప్ లైన్ లీకేజీలపై కొరడా ఝులిపించాల్సిన వరంగల్ మహా నగర పాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఒక్కో లీకేజీ మరమ్మతులకు నెలల తరబడి సమయం పడుతున్నా వీరు చూసీ, చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి కనీస చర్యలు చేపట్ట లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రజలకు మిషన్ భగీరథ తాగునీరు అందకపోవడానికి ప్రజాప్రతినిధుల, అధికారుల నిర్లక్ష్యమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టడంతోపాటు మన్నికైన తాగునీటిని అందించి నగర ప్రజల ఇబ్బందులు తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు.



## తాగు నీటి సమస్యలు పరిష్కరించాలి..

**– బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా**

నీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలు ఎప్పటికపుడు పరిష్కరించాలని బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కమిషనర్ పాల్గొని తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బల్దియా ఇంజనీరింగ్ విభాగం, పబ్లిక్ హెల్త్ విభాగాలు సమన్వయంతో పనిచేసి నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను అరికట్టాలని, బల్దియా వ్యాప్తంగా ఉన్న డబుల్ నల్లా కనెక్షన్లను, ఏఈ లు డివిజన్ ల వారిగా గుర్తించాలని, ఇదే క్రమంలో రెవెన్యూ పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వచ్చే వేసవిలో నీటి ఎద్దడిని నివారించడానికి ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, నీటి వృథాను అరికట్టడానికి ప్రస్తుతం చేపడుతున్న చర్యలకు తోడు అదనంగా మరి కొన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. త్వరలో మరో మారు సమావేశం నిర్వహించడం జరుగుతుందని, నీటి సరఫరా తీరుకు సంబందించిన సమగ్ర సమాచారంతో హాజరు కావాలని ఈ సందర్భంగా కమీషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ కన్సల్టెంట్ రవి, ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ లు శ్రీనివాస్, రాజయ్య, శ్రీనివాస రావు, పబ్లిక్ హెల్త్ ఈఈ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రూర్బన్ పనులు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**
**కలెక్టరేట్ లో అధికారులతో సమీక్ష**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రూర్బన్ పథకం ద్వారా కేటాయించిన పనులను శీఘ్రగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో రూర్బన్ పథకం క్రింద చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనుల ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్యామ ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ కింద పర్వతగిరి క్లస్టర్‌లో రూ.30 కోట్లతో 95 పనులు చేపట్టగా రూ 3.92 కోట్ల వ్యయంతో 26 అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, 35 అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. మిగిలిన 34 పనులను వెంటనే ప్రారంభించాలని ఆమె ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం, పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, కాంపౌండ్ వాల్స్, కిచెన్ షేడ్స్, పంచాయతీ భవనముల నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్స్, లైబ్రరీ, విలేజ్ హాట్, హస్తకళాకారులు, చిన్నతరహా పారిశ్రామిక వేత్తలకు సమీకృత గ్రామీణ మార్కెటింగ్, స్వర్గధామం పనులు పూర్తయ్యాయని, కొంకపాక గ్రామంలో మిల్లెట్ డీహస్కింగ్ యూనిట్, చింతనెక్కొండ, ఎంగుగల్లు, గోపనపల్లెలో కూరగాయల పంటలు, ఏనుగల్లులో జంతు ఆరోగ్య కేంద్రం, ఎనుగల్లులో రెండు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం



గల గోడౌన్ పనులు, పర్వతగిరిలో రూ.60 లక్షల పెట్టుబడితో షాపింగ్ కాంప్లెక్స్, లైబ్రరీ, విలేజ్ హాట్ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. పర్వతగిరి గ్రామంలో రూ.2.60 కోట్లతో మూడు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కలిగిన వ్యవసాయ గోదాం, రూ.2 కోట్లతో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సంపత్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి ఉషా దయాల్, జిల్లా వైద్య శాఖ అధికారి వాసంతి, ఈఈ ఇరిగేషన్ రాజు, ఈఈఈడబ్ల్యూ కుమార్, ఈఈ పీఆర్ ఇజ్జగిరి, జిల్లా ఉద్యానవనాలు అధికారి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప పూజలో కార్పొరేటర్లు..

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని 32వ డివిజన్ శ్రీను-శ్రీదేవి అయ్యప్ప కుటీరంలో మంగళవారం ధర్మశాస్త్ర అయ్యప్ప భక్త మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ-రవి పాల్గొని ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 42వ డివిజన్‌లో..

బెస్తంచెరువు వద్దనున్న శ్రీ మడేలయేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన “శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ” కార్యక్రమంలో 42 వడివిజన్ కార్పొరేటర్ “గుండు చందన పూర్ణచందర్” పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## రాష్ట్ర నూతన అధ్యక్షుడికి సన్మానం



**వరంగల్ వాయిస్, జనగామ :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ధర్మకంచ, జనగామలో మంగళవారం కామర్స్ ఒకేషనల్ లెక్చరర్ గా పనిచేస్తున్న డాక్టర్ వస్కుల శ్రీనివాస్ తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ – 475కి ఇటీవల హైదరాబాదులో టీచర్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర నూతన కార్యవర్గంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా కళాశాల అధ్యాపకుల బృందం, జనగాం జిల్లా 475 అసోసియేషన్ బృందం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వస్కుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ప్రభుత్వ కళాశాలలో, అధ్యాపకులలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. జూనియర్ కళాశాలలో చదివే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర అధ్యక్షుడిగా చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ వేముల శేఖర్, జనగాం జిల్లా 475 అసోసియేషన్ కార్యదర్శి గోక గణేష్, లైబ్రరియన్ రంగన్న, అధ్యాపకులు నందిని పటేల్, ఎల్లా శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ వరుధిని, తిరుమలేష్, కాపర్తి శ్రీనివాస్, రజిత, ఇశ్రాత్ భాను, సబిహా బేగం, షహనాజ్, ముక్తా ధీర్, ఇంతియాజ్, మరిపెల్ల రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాల యేసు జన్మదిన వేడుకల



**వరంగల్ వాయిస్, పరకాల :** లోక రక్షకుడిగా జన్మించిన క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని జ్యోతి మానసిక వికలాంగుల స్కూల్లో చిన్నారి బాలబాలికలతో ఆ చిన్నారి బాల యేసుని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ డీ సిస్టర్స్ ఆధ్వర్యంలో ఒకటో వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ కేక్ కట్ చేసి పిల్లలకు మంచి సందేశాన్ని అందించారు. ప్రేమ, కరుణ, దయ, శాంతి, సమాధానాలు కలిగి మనం కూడా ఒకరితో ఒకరం మన దగ్గర ఉన్నది పంచుకొని జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ మెరిన్, సిస్టర్ లిడియా, విద్యార్థిని విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన చల్లా



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకుడు కంచ క్రిష్ణ (కిట్టు)నిన్న రోడ్డు ప్రమాదంలో మరణించారు. మంగళవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి క్రిష్ణ పార్థీవ దేహాన్ని సందర్శించి తన ప్రగాఢ సంతాపం తెలిపి నివాళులు అర్పించారు. ప్రమాదానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన అర్శనపల్లి సమ్మక్క, అయిలి రవీందర్ గౌడ్, చిట్టిరెడ్డి కళింగ రెడ్డిల కుటుంబ సభ్యులను పరామర్శించారు.మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు,

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని అభివృద్ధి కోసం రాజకీయాలకతీతంగా సహకరిస్తానని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామని స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం రఘునాథపల్లి మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం అనంతరం ఆత్మీయ సన్మానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కడియం శ్రీహరిని పూలమాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ కార్యకర్తలకు ప్రజాప్రతినిధులకు ఎవరికి ఏ కష్టం వచ్చినా 24 గంటలు అందుబాటులో ఉంటానని, ఎవరూ ఆధైర్యపడొద్దని ఆయన కోరారు. నిత్యం అందుబాటులో ఉంటూ స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా తాను సలహాలు సూచనలు స్వీకరిస్తానన్నారు. ప్రజలే నా బలం కార్యకర్తలే బలగం వారి సంక్షేమమే నా లక్ష్యమని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థుల విజయం కోసం పార్టీ ప్రణాళిక సిద్ధం చేసిందని, ప్రతి ఒక్కరూ పార్టీ కోసం సైనికులుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మనం అధికారంలో లేమని బాధపడవద్దని, నేను మీకు అండగా ఉంటానని, మీరు ప్రజలకు. కార్యకర్తలకు అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు గుడి వంశీధర్ రెడ్డి, బొల్లం అజయ్, మణికంఠ, రాష్ట్ర నాయకులు మారుజోడు రాంబాబు, నామాల బుచ్చయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు వారాల రమేష్ యాదవ్, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



**వరంగల్ వాయిస్, రఘునాథ్ పల్లి :** కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం కన్నయ్య పెల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పగిడి పాల అశోక్, గబ్బెట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఉపాధ్యక్షుడులింగాల జగదీష్ చందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ఆరు గ్యారెంటీలు అమలు కావాలంటే రాబోయే ఎన్నిల్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అలాగే ఈ పథకాలకు పేద ప్రజలకు చేరవేయడంలో సీఎం రేవంత్ రెడ్డి నిన్న చెప్పినట్లుగానే నియోజకవర్గ ఇంచార్జి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపూర్ ఇందిర నియోవర్గంలో అన్ని గ్రామాలలో పథకాలు అందజేయడంలో ముందుండి ప్రజలకు చేరవేయుటకు కృషి చేస్తారన్నారు. కాబట్టి స్థానిక సంస్థల ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకున్నట్లయితే పథకాలు పెద్ద సంఖ్యలో గ్రామాలకు అభివృద్ధి ఫలాలు అందుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, అరవింద్ రెడ్డి, కావటి భాస్కర్ యాదవ్, నీలం యువరాజు, సర్పంచ్ జట్టబోయిన రాజు, ఎంపీటీసీలు రచ్చ సోమనాథం, గూడెల్లి శిరీష సురేష్, గూడెల్లి మహేష్, పులి వెంకట్ నర్సు, తాళ్లపల్లి కరుణాకర్, రామాంజనేయులు, నజీర్, ఆక్బాషా, అజ్జు రాజు, యాదగిరి, రమేష్, కాజా, సమ్మయ్య, అమరా బాబు, మునీర్, పగిడి పాల అశోక్, భాష కుమార్, మంతపురి అనిల్, కన్నా సోమయ్య, రామగోని రమేష్, రామగుని భాస్కర్, మంతపురి మైసయ్య, శేరి సోమిరెడ్డి, శేరి యాదిరెడ్డి, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ పండుగ హోదా కల్పించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశంలోనే అతిపెద్ద గిరిజన సంప్రదాయ జాతరైన సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ పండుగ హోదా కల్పించాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రధానమంత్రికి లేఖ విడుదల చేసిన సందర్భంగా డాక్టర్ శేషు మాట్లాడుతూ ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే గిరిజన జాతరకు దరిదాపు మూడు కోట్ల మంది గిరిజన, గిరిజనేతర ప్రజలు హాజరయ్యే అతిపెద్ద జాతరను దేశంలో గిరి సంప్రదాయాన్ని ఈ ప్రాంత వన దేవతలను గౌరవించే విధంగా సమ్మక్క సారలమ్మ జాతరనుజాతీయ పండుగగా గుర్తించి కేంద్రం కూడా జాతరకు ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనేక సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలు, ఆదివాసీలు, గిరిజనులు, సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కోరుతున్నారు. గత కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు, కాబట్టి మీరైనా జాతరను జాతీయ పండుగ గా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్, రాంబాబు, సతీష్ పాల్గొన్నారు.

# హమాలి కార్మికులకు బెడ్డింగ్ దిగుమతుల రేట్లు పెంచాలి

## ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 29 నుంచి నిరవధిక సమ్మె



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎఫ్ సీఐ గోదాముల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల బెడ్డింగ్ దిగుమతుల రేట్లు పెంచుటకు మిల్లు యజమానులతో చర్చలు జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు వరంగల్ జిల్లా మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. గత రెండు సంవత్సరాల క్రితం లేబర్ అధికారుల సమక్షంలో మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కార్మిక సంఘాల యూనియన్ ప్రతినిధులు చర్చలు జరిపి దిగుమతి కూలీ రేట్లు రూ.4700 ఇచ్చేందుకు అగ్రిమెంట్ జరిగిందని, అది రెండు సంవత్సరాల మాత్రమే అమలులో ఉన్నందున మళ్లీ రేట్ల పెంపుదల కోసం యజమానితో మాట్లాడినప్పటికీ వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారని సంఘం నాయకులు తెలిపారు. చివరగా ఈనెల 13న కాజీపేటలో ఎఫ్ సీఐ గోదాంలో యజమానులు, యూనియన్ నాయకుల మధ్య చర్చలు నిర్వహించామని, ఈ చర్చలలో ఎఫ్ సీఐ కాజీపేట గోదాం, సీడబ్ల్యూసీ గోదాం, నెక్కొండ గోదాం ప్రాంత కార్మికులు పాల్గొన్నారు. అవి సఫలీకృతం కాలేదని, గతంలో ఉన్న రేట్లకే పనిచేయాలని యజమానులు అంటున్నారని హమాలీలు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో పెరిగిన ధరలకు అనుగుణంగా కుటుంబ అవసరాలు పెరిగి, ఖర్చులు పెరిగిన దృష్ట్యా రేట్ల పెంపుదలకు యజమానులు అంగీకరించకపోవడంతో ఈనెల 29 నుంచి నిరవధిక సమ్మె చేయబోతున్నామని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సమస్యను ముందుగా పరిష్కరించుటకు కలెక్టర్ చర్య తీసుకుని యజమానులతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ధర్నా అనంతరం యూనియన్ నాయకులు, కార్మికులు, వరంగల్ జిల్లా ఇంచార్జి డీఆర్ఓ, వరంగల్ ఆర్డీవో వాసు చంద్రకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు, యూనియన్ అధ్యక్షులు ఆరెల్లి కృష్ణ, జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్, యూనియన్ ప్రధాన కార్యదర్శి మందాటి శ్రీనివాస్, కార్మికులు జి రమేష్, ఎం నరసయ్య, బి సాజిద్, సాయిలు, టి రాజేష్, బి కుమార్, ఆర్ రాజు, జి గణేష్, తదితరులతో పాటు ఏఐకేఎంఎస్ నాయకులు రాచర్ల బాలరాజు, పీవైఎల్ జిల్లా నాయకులు హరిబాబు పాల్గొన్నారు.

# అరచేతిలో 'విశ్వ'విద్యాలయం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పరుగులు పెట్టే మానవ ప్రపంచానికి ఎప్పుడూ తొందరే. ఎంతటి విద్యావంతులు అయినా "నైపుణ్యం" ముఖ్యం. విద్యకు నైపుణ్యం ఉంటే కొలువుల ప్రపంచంలో సింహద్వార స్వాగతం ఖాయం. తెలంగాణ ప్రభుత్వం స్వయం ఉపాధికి నైపుణ్యాభివృద్ధికి వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. సెట్విన్, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖ సంయుక్తంగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. 46కోర్సుల్లో యాప్ ద్వారా ఉచిత ఆన్ లైన్ శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలను అందిస్తుంది. ఉచిత ఆన్లైన్ శిక్షణకు సెట్విన్, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖ వారితో కలిసి గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ జయశంకర్ భూపాలపల్లిలో మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నమోదై ఉన్న కార్మికుల పిల్లలకు ఉచిత కెరీర్ గైడెన్స్, రెజ్యూమ్ ప్రిపరేషన్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ శ్యాంప్రసాద్ పాల్గోని విద్యార్థిని విద్యార్థులతో సంస్థ ఉచితంగా ఇచ్చే విద్యా కోర్సులను వినియోగించుకొని మంచి భవిష్యత్తు పొందాలని విద్యార్థిని విద్యార్థులకు సూచిస్తూ ప్రసంగించారు. పరస్పరం చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ యు.నాగేశ్వర్ రావు, ప్రాజెక్టు లీడ్స్ సాదిక్, జి.సూరిబాబు పాల్గొని మొత్తం 146 మంది విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

## సీతారామాంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 19వ డివిజన్ లో మంగళవారం కాశిబుగ్గ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాతం శ్రీనివాస్, భావన దంపతులచే ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యుడు కూచన ఏకాంబరం, నీలం శ్రీనివాస్, ఆడెపు సాగర్, దాసి శివకృష్ణ, తదితర భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాగరాజును కలిసిన మడికొండ బొడ్రాయి కమిటీ చైర్మన్



**వరంగల్ వాయిస్, మడికొండ :** వర్ధన్నపేట నియోజకవర్గం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ ను మంగళవారం మడికొండ బొడ్రాయి కమిటీ చైర్మన్ బుర్ర శ్రీధర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తొట్ల రాజు యాదవ్ , 46వ డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ వస్కుల శంకర్, కొప్పుల నవీన్ యాదవ్, 46వ డివిజన్ అధ్యక్షుడు వస్కుల నాగరాజు, మూల చంద్రమౌళి, రాజేందర్, వల్లెపు గోపి, మానుపాటి రాజు కూన, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**వరంగల్ వాయిస్, మరిపెడ:** తొర్రూరు డివిజన్ పరిధిలో ని విద్యుత్ సబ్ స్టేషన్లలో బుధవారం 3ఫేస్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మరిపెడ విద్యుత్ శాఖ ఏడీఈ లోక్ నాథ్ రెడ్డి మంగళవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు, రైతులకు 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 3ఫేస్ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 220 కేవీ వడ్డే కొత్తపల్లి, 132 పెద్ద నాగరం సబ్ స్టేషన్ లో మరమ్మత్తులు కారణంగా డివిజన్ పరిధిలో తొర్రూరు, పెద్ద వంగర, నర్సింహులపేట, దంతాలపల్లి, మరిపెడ సబ్ స్టేషన్ పరిధిలో 3ఫేస్ విద్యుత్ సరఫరా ఉండదు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించగలరని ఏడీఈ కోరారు.

## తాడిచెర్ల నుంచి అక్రమ మొరం రవాణా



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ సమీపంలోని అసైన్డ్ భూముల నుంచి గత వారం రోజులుగా అక్రమ మట్టి రవాణా జరుగుతున్న అధికారులు చూసి చూడనట్టు వదిలేయడం చర్చనీయాంశనీయంగా మారింది. ఓపెన్ కాస్ట్ సమీపంలోని అసైన్డ్ భూములలో జేసీబీల సహాయంతో సుమారు 7ఫీట్ల వరకు మొరం తీసి తాడిచెర్ల ఖమ్మం పల్లి వంతెన మీదుగా తరలించి పెద్దపల్లి జిల్లాలో రోడ్డు నిర్మాణానికి తరలించి లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మొరం అక్రమ రవాణా రాత్రి సమయంలో మొదలై ఉదయం వరకు కొనసాగుతుంది. ఇది గమనించిన సమీప పొలాల రైతులు మొరం తీస్తున్న ప్రదేశానికి వెళ్లడంతో అక్రమార్కులు లారీలు, జేసీబీలతో అక్కడి నుంచి ఉదయించారు. వారం రోజులుగా మొరం అక్రమ రవాణా జరుగుతున్న అధికారులు స్పందించక పోవడంపై సమీప పొలాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కూచిపూడి నృత్యంలో శ్రీ నలంద విద్యార్థుల ప్రతిభ




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** గిన్నీస్ వరల్డ్ రికార్డ్ అబీదర్ ఐన కీర్తి ఆర్ట్స్ అకాడమీ వారు రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్తీక మహోత్సవం కార్యక్రమంలో భాగం గా శ్రీ నలంద పాఠశాల విద్యార్థులు కూచిపూడి నృత్యంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమ ముఖ్య అతిథులు అప్పల శ్రీనివాస గుప్తా, రామదాసు తేజావత్, దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా నటరాజ శివ నటన పురస్కార్ 2023లను, ప్రశంశా పత్రాలను విద్యార్థులు అందు కున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పాలడుగుల రవీందర్ మాట్లాడుతూ కూచిపూడి నృత్యంలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులను, డాన్స్ మాస్టర్ రాజేందర్ ను అభినంధించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినుల తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కారక్రమంలో ఏజీఎం రాంకీ, జడ్‌ఏసీ మహేష్, ఏజడ్ఏసీ శ్రీహరి, అకాడమిక్ డీన్ యాకన్న, ప్రైమరీ కో–ఆర్డినేటర్ అశ్విని, ప్రైమరీ ఇంచార్జి పుష్ప, ప్రీ ప్రైమరీ ఇంచార్జి శ్వేతారెడ్డి, డాన్స్ మాస్టర్ రాజేందర్, తల్లిదండ్రలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన మాజీ కార్పొరేటర్ వేల్పుల



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వేల్పుల మోహన్ రావు మంగళవారం నయీంనగర్ లో వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. చేరిన వారిలో వాసం శ్రీధర్, అభిలాష్, వేల్పుల పున్నం చందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంకేశ్వరపు సురేందర్, సీనియర్ నాయకులు, కే.కృష్ణ పాల్గొన్నారు

## కొండా దంపతుల విజయోత్సవ ర్యాలీకి భారీగా తరలివెళ్దాం

### బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్ గౌడ్



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ లో దేవాదాయ, పర్యావరణ, అటవీ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి మొట్టమొదటిసారిగా ఈనెల 23న వరంగల్ కు రానున్నందున స్వాగతం పలికేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కొండా దంపతుల అభిమానులు భారీగా తరలి వెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్, కొండా యువసేన మండల అధ్యక్షుడు వేముల కిరణ్ గౌడ్, కొండా దంపతుల వీరాభిమాని చర్లపల్లి శ్రీధర్ లు పిలుపునిచ్చారు. ఓరుగల్లు రుద్రమదేవి, గుణంలో సీతాదేవి, రూపంలో పార్వతి దేవి, పోరాటంలో ఝాన్సీ రాణి, వీరత్వంలో సమ్మక్క సారలమ్మల వలే పేరు ప్రఖ్యాతులుగాంచిన కొండా సురేఖ పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా, ఆపదొస్తే ఆదుకునే మనస్తత్వం కలిగిన నాయకురాలిగా, నిత్యం ప్రజా సేవకై అంకితమయ్యారని కొనియాడారు. కొండా సురేఖ పేద ప్రజల గుండెల్లో కొలువైన దేవతగా వారు అభివర్ణించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొండా దంపతుల అభిమానులు భారీగా తరలిరావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు..

## ఎమ్మెల్యే నాగరాజుకు అభినందనలు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మంగళవారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నేదునూరి రాజమౌళి మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజా సమస్యలపై పరిష్కారానికి మా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

## పెద్దల జ్ఞాపకార్థంగా దుప్పట్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని భగవాన్ తండాలో పల్ల పోతుల లక్ష్మీనరసయ్య, కీర్తిశేషులు నార్ల బతుకమ్మ, నార్ల రాజయ్య, భార్య యకాంతమ్మ జ్ఞాపకార్థంగా మంగళవారం భగవాన్ తండాలోని నిరుపేదలకు 150 దుప్పట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై పి. శ్రీనివాస్, ప్రజలు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో మహా అన్నదానం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రతిరోజు నిత్య అన్నదానం జరుగుతుంది. మహా అన్నదాన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పరకాల పట్టణానికి చెందిన కుక్కల విజయ్ కుమార్ ధర్మపత్ని సునందల పుత్రిక కీర్తన జన్మదిన వేడుకల సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయంలో మహా అన్నదానం నిర్వహించారు. స్వాములకు మహా అన్నదానంతో పాటు పోడిభిక్ష పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ గురు స్వాములు మాణిక్యం బాపూరావు, సాయిని దేశపతి, రాజు, గోపీనాథ్, యాదగిరి, ఏదుల రమేష్ తో పాటు సిద్ధం శెట్టి రాజు, విజయ్, కిషన్ రెడ్డి, సాయి, రాజ్ కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, కాజీపేట :** వర్ధన్నపేట నియోజకవర్గంలోని కాజీపేట మండలానికి చెందిన 44, 45, 46, 64 డివిజన్ల లోని అర్హులకు మంగళవారం కాజీపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తొట్ల రాజు యాదవ్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హనుమకొండలోని అంబేద్కర్ భవన్ లో అర్హులైన పేదల అందరికీ కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ వస్కుల శంకర్, సిటీ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ టి జగదీష్ రెడ్డి, టేకులగూడెం గ్రామ పార్టీ అధ్యక్షుడు బండి శివరాజ్, డివిజన్ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, గ్రామ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండలంలోని మౌనికల వేడు గ్రామానికి చెందిన సుపారి అభి అనే యువకుడు నెల్లికుదురు మండలం నుంచి వీరి గ్రామానికి వెళ్లే మార్గంలో గల రావిరాల క్రాస్ రోడ్ వద్ద, బైకు అదుపు తప్పి కింద పడి అపస్మారక స్థితిలో రోడ్డు ప్రక్కన పడి ఉన్నాడు. ఈ సమయంలో అటుగా వెళుతున్న మహబూబాబాద్ నూతన శాసనసభ్యుడు డాక్టర్ మురళీ నాయక్ చూసి వెంటనే బాధితుడిని తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ మురళి నాయక్ మానవత్వంతో చేసిన ఈ పనిని అటుగా వెళుతున్న ప్రయాణికులు చూసి అభినందించారు.

## రాష్ట్ర స్థాయికి ఎంపికైన గిరిజన విద్యార్థి



**వరంగల్ వాయిస్, కాటారం:** 67వ ఎస్ జీఎఫ్ఐ అండర్ –14 వయస్సు లో వాలీబాల్ విభాగం లో కాటారం ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల నుంచి ఎస్ చరణ్ మహబూబ్ నగర్ లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చి ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు తరుపున బ్రాంచ్ మెడల్ సాధించారు. చరణ్ వరంగల్ ఉమ్మడి జిల్లా కెప్టెన్ గా వహించి అత్యంత ప్రతిభ కనబర్చి తెలంగాణ జట్టు తరుపున ఒడిశాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఈ ఎంపిక పట్ల కళాశాల ప్రిన్సిపాల్ జే కే బుచ్చయ్య , వైస్ ప్రిన్సిపల్స్ హెచ్ రాజేందర్, ఎస్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్, సతీష్, కోచ్ వెంకటేష్, కళాశాల ఉపాధ్యాయులు అభినందించారు.

# సమస్యల పరిష్కారంలో విఫలమైన పాలకులు

### సాధినేని వెంకటేశ్వరరావు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** 75 ఏళ్ల స్వతంత్ర భారత పాలనలో ప్రజల సమస్యలు మరింత పెరిగిపోయాయని, ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించటంలో పాలకవర్గాలు విఫలమయ్యాయని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. బయ్యారం, గార్ల మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో నిరుద్యోగం, దారిద్ర్యం పెరిగి పోతుందని, ప్రపంచ ఆకలి సూచిలో మన స్థానం అట్టడుగున ఉందన్నారు. అభివృద్ధిలో దూసుకుపోతున్నామని చెప్పే మాటలు బూటకమని ఆయన దుయ్యబట్టారు. ప్రజల అసంతృప్తిని సొమ్ము చేసుకొని ఓట్ల ద్వారా గెలుస్తున్న ప్రత్యామ్నాయ పార్టీల పాలన గత పాలకుల దారిలోనే కొనసాగుతుండటం వల్లనే దేశం ఈ దుస్థితిలో ఉందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ నియంతృత్వ పాలనపై వ్యతిరేకతతోనే కాంగ్రెస్ ను ప్రజలు గెలిపించారన్నారు. నెగిటివ్ ఓటుతో గెలిచిన కాంగ్రెస్ పార్టీకి ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత ఉందన్నారు. పౌర హక్కులను రక్షించుకోవాల్సింది ప్రజలేనని ఆయన తెలిపారు. సామాజిక, ప్రజా ఉద్యమాలు మాత్రమే నియంతృత్వ విధానాలను నిలువరించగలుగుతాయని పేర్కొన్నారు. జెండాలు వేరైనా అన్ని పార్టీల పరిపాలనలో ధనికులు మరింత ధనికులు గాను,పేదలు మరింత పేదలు గాను మారుతున్నారని ఆయన అన్నారు. భూస్వామ్య, పెట్టుబడిదారీ అనుకూల రాజ్యాంగ యంత్రాగాన్ని ధ్వంసం చేసినప్పుడు మాత్రమే ప్రజల బ్రతుకులు మారతాయని తెలిపారు. ఎన్నికల స్వామ్యం అంతిమంగా సంపన్న వర్గాల పెరటి దొడ్డిగా మారుతుందని అన్నారు. ప్రజలను చైతన్య వంతంచేసి బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించటమే విప్లవ కమ్యూనిస్టు కార్యకర్తల ప్రధాన లక్ష్యంగా ఉండాలని హితవు పలికారు. పార్టీ బయ్యారం సబ్ డివిజన్ కార్యదర్శి మోకాళ్ల మురళీక్రిష్ణ అధ్యక్షతన జరిగిన ఈ జనరల్ బాడీ సమావేశంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, జిల్లా నాయకులు జడ సత్యనారాయణ, ఊకె పద్మలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాధంశెట్టి నాగేశ్వరరావు, తుడుం వీరభద్రం, బానోత్ నర్సింహా, అరెం కోటమ్మ, పూనెం లింగన్న, సూరబాక రాంబాబు, తొగరు కొమరయ్య, పాయం సమ్మయ్య, మేకపోతుల నాగేశ్వరరావు, గౌని భద్రయ్య, కుసిని బాబురావు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి తోడ్పాటునందించండి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ఎర్రబెల్లిగూడెం గ్రామ అభివృద్ధికి మీ తోడ్పాటు అందించాలని ఎర్రబెల్లిగూడెం గ్రామ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు పనికర విజేందర్ యాదవ్ మహబూబాబాద్ శాసనసభ్యుడు డాక్టర్ మురళి నాయక్ ను కోరారు. మంగళవారం మహబూబాబాద్ నియోజకవర్గం నెల్లికుదురు మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్యే అభినందన సభలో ఎర్రబెల్లిగూడెం యూత్ కమిటీ ఆధ్వర్యంలో మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను వివరించి తమ ఊరి అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని విన్నవించారు. విజేందర్ యాదవ్ మాట్లాడుతూ మంచి మనసున్న మన శాసనసభ్యుడు డాక్టర్ మురళి నాయక్ మన గ్రామాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాదని హామీ ఇచ్చాడని తెలిపారు. మురళి నాయక్ కు గ్రామ సమస్యలను విన్నవించిన వారిలో కాంగ్రెస్ నాయకులు గుండెబోయిన అశోక్, మంద శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## నూతన ఎమ్మెల్యేలను కలిసిన జేసీఐ ప్రతినిధులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఇటీవల ఎన్నికలలో గెలిచిన ఎమ్మెల్యేలను మంగళవారం సర్క్యూట్ గెస్ట్ హౌస్ రోడ్డులో గల ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ వద్ద వరంగల్ పశ్చిమ శాసనసభ సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డిని, సుబేదారిలో గల తన నివాసంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ )వరంగల్ కాకతీయ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేసీఐ వరంగల్ కాకతీయ ప్రెసిడెంట్ జేసీ ఐలీ వంశీకృష్ణ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం యువత ఉపాధి కోసం డీఎస్సీ గౌట్ నోటిఫికేషన్ ఇవ్వబోతున్న గవర్నమెంట్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఉమ్మడి వరంగల్ యువతకు చేయూత కల్పించడానికి తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ అజీజ్ ఖాన్, రామప్ప అకాడమీ చైర్మన్ చంద్రమోహన్ గౌడ్, జేసీఐ నేషనల్ డైరెక్టర్ రమేష్ గడిగల, ఎలెక్ట్ ప్రెసిడెంట్ కొలగాని రాజేందర్, వైస్ ప్రెసిడెంట్ గూడెపు శివాజీ, మహేందర్, సెయింట్ థామస్ చైర్మన్ ప్రిన్సిపల్ మనోహర్, ప్రణీత్ పాల్గొన్నారు.



## మంత్రి పొన్నంను కలిసిన బొనగాని యాదగిరి గౌడ్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్ గా బాధ్యతలు స్వీకరించిన పొన్నం ప్రభాకర్ గౌడ్ ను మంగళవారం తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమితులైన బుర్రా వెంకటేశం గౌడ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింత రమేష్ గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు గండు శ్రీనివాస్ గౌడ్, బీ.అఖిల్ కుమార్ గౌడ్, బుర్ర శ్యామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

## కలెక్టర్ కె.శశాంక



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రత్యేక ఓటర్ జాబితా రూపకల్పనకు సహకరించాలని జిల్లా కలెక్టర్ శశాంక అఖిలపక్ష పార్టీల ప్రతినిధులను కోరారు. మంగళవారం ఐడీఓసీలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతకు ఓటు హక్కు కల్పించనున్న నేపథ్యంలో సెకండరీ సమ్మర్ రివిజన్ ప్రత్యేక ఓటర్ల నమోదు జాబితా రూపకల్పనకు చేపడుతున్న ప్రణాళిక పై కలెక్టర్ అఖిలపక్ష పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 20 తేదీ నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు తెలియజేస్తూ 2024 జనవరి 6 నుంచి 22 వరకు అభ్యంతరాలు అందజేయవచ్చునన్నారు. జనవరి 6న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించనున్నామని 2024 ఫిబ్రవరి 8న తుది ఓటర్ల నమోదు జాబితాను ప్రకటిస్తామన్నారు. బీఎల్ఓలకు బీఎల్ఓ సూపర్వైజర్లకు ఓటర్ల జాబితా నమోదుపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మృతుల ఓటర్ల వివరాలు రిజిస్టర్ లోనమోదు చేస్తామని, వాటి తొలగింపుపై స్థానికంగా విచారణ చేపడతామని పార్టీ ప్రతినిధులు సహకరించాలన్నారు. అదేవిధంగా డబుల్ ఓటర్ల తొలగింపుకు చర్యలు తీసుకుంటామన్నారు. దివ్యాంగుల ఓటర్ల మార్కింగ్ పెరగాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు శ్రీరామగిరి పరిధిలోని బంజర తండా తోపాటు పలు తండాలో సుమారు నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల దూర ప్రాంతంగా ఉన్నాయని పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు పార్టీ ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తేగా పోలింగ్ స్టేషన్ల మార్పులు చేర్పులపై ప్రజల ఇబ్బందులను సమస్యలను దృష్టిలో పెట్టుకొని నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో పోలింగ్ శాతం పై పట్టణ ప్రాంతాలలో 60 శాతం నమోదు కాకపోవటం తమ దృష్టికి వచ్చిందని గ్రామీణ ప్రాంతంలో ఓటింగ్ శాతం 90శాతానికి చేరుకున్నదన్నారు. పట్టణ ప్రాంతం ఓటర్లను చైతన్యవంతులు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ సమావేశంలో అఖిలపక్ష పార్టీ ప్రతినిధులు సురేష్ నాయుడు, వెంకన్న, కన్నా, రాము, శివరాజు, విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ కేంద్ర విశ్వవిద్యాలయానికి చట్ట బద్ధత

**విభజన హామీలో ములుగుకు గిరిజన యూనివర్సిటీ**

**బిల్లును ఆమోదించిన రాష్ట్రపతికి ధన్యవాదాలు**

**మంత్రి ధనసరి అనసూయ సీతక్క**



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** హైదరాబాద్ లో శీతాకాల విడిదికి వచ్చిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముని మర్యాద పూర్వకంగా కలిసి సమ్మక్క సారలమ్మ కేంద్ర విశ్వవిద్యాలయానికి చట్ట బద్ధత కల్పిస్తూ బిల్లును ఆమోదించిన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకుతెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం డిసెంబర్ నెలలో రామప్ప కు రాష్ట్రపతి వచ్చిన సందర్భంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేయాలని కోరడం జరిగిందన్నారు.




ఇప్పుడు రాష్ట్రపతి శీతాకాల విడిదికి వచ్చిన సందర్భంగా చట్ట బద్ధత కల్పించిన రాష్ట్రపతికి ధన్యవాదలు తెలిపినట్లు పేర్కొన్నారు. 2014లో రాష్ట్ర విభజన హామీ ప్రకారం ములుగు జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు ఆనాటి కాంగ్రెస్ పార్టీ హామీ ఇవ్వడం జరిగిందని, గిరిజన యూనివర్సిటీ వలన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడుతాయని ఆమె తెలిపారు. వెనుకబడిన ములుగు జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. గిరిజన యూనివర్సిటీకి రూ.889కోట్లు మంజూరు కావడం జరిగిందని, పనులు ప్రారంభించి త్వరగా తరగతులు ప్రారంభమయ్యే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువస్తామని సీతక్క తెలిపారు.

# వచ్చే నెల నుంచి నిరుద్యోగ భృతి చెల్లించాలి

## విద్యార్థి నిరుద్యోగ జేఏసీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రకటించిన నిరుద్యోగ భృతి ప్రతి నెల రూ.4 వేల హామీని వచ్చే నెల నుంచి అమలు చేయాలని విద్యార్థి నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. నిరుద్యోగ భృతి చెల్లింపులో జాప్యమైతే చెల్లించని భృతి బకాయిగా పేర్కొని అమలు చేసే రోజు నుంచి బకాయిలు కూడా చెల్లించాలన్నారు. నిరుద్యోగ భృతి మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. నిరుద్యోగులు వారి కుటుంబాల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల నిరుద్యోగ భృతి విషయంలో కానివ్వండి, నోటిఫికేషన్ల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే నిరుద్యోగ జేఏసీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. 2లక్షల ఉద్యోగాలు ఎక్కడెక్కడ ఉన్నాయో రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం వెంటనే విడుదల చేసి వాటి భర్తీకి వేగవంతంగా చర్యలు చేపట్టాలన్నారు. గవర్నర్ వద్ద నిలిచిపోయిన విశ్వవిద్యాలయాల్లో బోధనా సిబ్బంది భర్తీ బిల్లును గవర్నర్ తో వెంటనే ఆమోదించి సహాయ ఆచార్య ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. గవర్నర్ ఆమోదించకుంటే సహాయ ఆచార్య నియామక ప్రక్రియను పాత పద్ధతిలో విశ్వవిద్యాలయాలకు అప్పగించి తక్షణమే భర్తీ చేయాలన్నారు. 18 సంవత్సరాలు పైబడిన కళాశాల విద్యను అభ్యసిస్తున్న చెల్లెమ్మలకు ఎలక్ట్రికల్ స్కూటీ లను ఇచ్చే కార్యక్రమం తొందరగా చేపట్టాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల్లో బోధనేతర సిబ్బంది ఖాళీలను గుర్తించి వాటి భర్తీకి తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి తదుపరి వారిని క్రమబద్ధీకరించాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ పార్ట్ టైమ్, టైమ్ స్కేల్ బోధనా,బోధనేతర సిబ్బంది గా పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలి. లేకుంటే పోరాటం తప్పదని మంగళవారం ఉదయం హెచ్చరించిన నిరుద్యోగ జేఏసీ నేతలు మానవతారాయ్, కేయూ జేఏసీ నేత మేడారపు సుధాకర్, ఓయూ నిరుద్యోగ జేఏసీ నేత దుర్గం వినోద్ పాల్గొన్నారు.

## దళారీ చిత్రాన్ని వీక్షించిన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఏషియన్ క్రియేషన్స్ పతాకం పై నిర్మించిన చిత్రం మా "దళారి" చిత్రం మంగళవారం పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేంద ర్ రెడ్డి వీక్షించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు కాచిడి గోపాల్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, నాయిని లక్ష్మా రెడ్డి, గన్నారపు సంగీత్, సాయి రామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన చిర్ర శేషాచలం గౌడ్(47) అనే గీత కార్మికుడి మంగళవారం తన వృత్తిలో భాగంగా తాడిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు క్రింద పడడంతో తొంటికాలు విరిగింది. శేషాచలం గౌడ్ కు ప్రభుత్వం తరపున మెరుగైన వైద్య సహాయం అందించాలని, అదేవిధంగా ప్రభుత్వం నుంచి వచ్చే ఎక్స్ గ్రేషియా త్వరలో విడుదల చేయాలని ముచ్చర్ల గ్రామ గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు చిర్ర సోమయ్య గౌడ్ కోరారు.

## చెత్త బుట్టలోకి చేరిన గృహలక్ష్మి దరఖాస్తులు




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 15లక్షల 'గృహ లక్ష్మి' దరఖాస్తులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. గృహ నిర్మాణాల కోసం రూ.3లక్షలు ఇచ్చేందుకు ఈ పథకాన్ని ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీంతో ఈ పథకానికి దరఖాస్తుల వెల్లువెత్తాయి. తాజాగా గృహలక్ష్మి పథకం కోసం బీఆర్ఎస్ హయాంలో సేకరించిన 15లక్షల పైచిలుకు దరఖాస్తుల్ని పరిగణించకూడదని, కాంగ్రెస్ సర్కారు నిర్ణయించింది. వాటి స్థానంలో కొత్తవి తీసుకోవాలని భావిస్తోంది. ఆ పథకానికి వచ్చిన మొత్తం పిటిషన్లలో 12లక్షలు అర్హమైనవిగా అధికారులు గుర్తించారు. అయితే వాటన్నింటిని ఇప్పుడు చెత్తబుట్టలో వేయనున్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రామ సభలు నిర్వహించి అక్కడే దరఖాస్తులు స్వీకరించాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే గ్రామ సభల తేదీలను ప్రకటించేందుకు కసరత్తు చేస్తోంది.

## రేషన్ బియ్యం పట్టివేత

**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** అక్రమంగా తరలిస్తున్న 25క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు చెన్నారావుపేట ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున మండలంలోని గురిజాల గ్రామంలో పోలీసులతో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అశోక లి లాండ్ మినీ ట్రక్కు వాహనంలో వరంగల్ కు చెందిన ఆవుల నాగరాజు అనే వ్యక్తి 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నాడు. వెంటనే వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. పట్టుకున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. అలాగే ఆవుల నాగరాజు అనే వ్యక్తి పై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

# విజువల్ వండర్‌గా హను-మాన్





జాంబీరెడ్డి సినిమా తర్వాత తేజ సజ్జా , ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం హను-మాన్ విజువల్ వండర్‌గా ఉండనుంది. ఇది ఫస్ట్ ఇండియన్ ఒరిజినల్, పాన్ వరల్డ్ సూపర్ హీరో సినిమాగా ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వస్తోన్న ఈ చిత్రం టీజర్ ఇటీవల విడుదలవగా అద్భుతమైన స్పందన వచ్చింది. ఇందులోని విజువల్స్, గ్రాఫిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అయి జాతీయ స్థాయిలో సినిమాపై హైప్ వచ్చింది. అదేవిధంగా ఇప్పటివరకు రిలీజ్ చేసిన మూడు పాటలు ఒకదాన్ని మించి మరోటి సక్సెస్ సాధించాయి. తాజాగా విడుదల చేసిన ట్రైలర్ కూడా అద్భుతంగా ఉంది. ఇంతవరకు మనం ఏ చిత్రంలో చూడని విధంగా అద్భుతమైన గ్రాఫిక్స్, విజువల్స్‌తో మెస్మరైజ్ చేశారు. అదేవిధంగా విలన్ పాత్రధారిని కూడా హాలీవుడ్ సూపర్ హీరోస్ స్థాయిలో మేకోవర్ చేయించిన విధానం, తమ్ముడి కోసం అక్క వరలక్ష్మి అడ్డు నిలవడం వంటి కొన్ని ఆసక్తికర సన్నివేశాలతో సినిమాపై హైప్స్ భారీగా పెరిగేలా చేశారు. సంక్రాంతికి విడుదల అవుతున్న 6 పెద్ద సినిమాలతో పోటీగా వస్తున్న ఈ హనుమాన్ చిత్రమే ఖచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుందని ట్రైలర్‌ను చూస్తూంటేనే అర్థమవుతుంది.

హను-మాన్ సినిమాను జనవరి 12న తెలుగు, హిందీ, మరాఠీ, తమిళం, కన్నడ, మలయాళం, ఇంగ్లీష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్‌తో సహా పలు భారతీయ భాషల్లో పాన్ వరల్డ్ సినిమాగా విడుదల చేస్తున్నారు. పవర్‌ఫుల్ డైలాగ్స్.. అద్భుతమైన విజువల్స్‌తో ట్రైలర్ అదిరిపోయింది. క్వాలిటీ విషయంలో ప్రశాంత్ వర్మ ఎక్కడా రాజీ పడనట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. 'యతో ధర్మ స్తతో హనుమ..యతో హనుమ..స్తతో జయ'అనే డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభం అవుతుంది. పల్లెటూరిలో ఉండే హీరోకి ఒక స్పెషల్ పవర్ ఉండడం.. విలన్(వినయ్ రాయ్) ఆ పవర్ కోసం ప్రయోగాలు చేయడం.. హీరో గురించి తెలిసి అతన్ని చంపేందుకు ప్రయత్నిస్తే హనుమంతుడు ఎలా కాపాడాడు? అసలు హీరోకి ఉన్న స్పెషల్ పవర్ ఏంటి? మామూలు వ్యక్తికి ఆ పవర్స్ ఎలా వచ్చాయి? అనేది ఈ సినిమా కథ అని ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. 'పోలేరమ్మ మీద ఒట్టు.. నా తమ్ముడి మీద చేతులు పడితే ఒక్కొక్కరికి టెంకాయలు పగిలిపోతాయి' అని వరలక్ష్మీ శరత్ కుమార్ చేస్నే÷ట్ సీన్ ట్రైలర్‌కి స్పెషల్ అట్రాక్షన్. 'నీకు కనబడుతుంది ఒకడి ఉన్మాదం మాత్రమే కానీ దాని వెనుక ఒక ఉపద్రవం దాగిఉంది', 'కలియుగంలో ధర్మంకోసం పోరాటే ప్రతి ఒక్కరి వెంట ఉన్నాడు.. నీ వెంటా ఉన్నాడు..మానవాళి మనుగడను కాపాడుకోవడం కోసం నీ రాక అనివార్యం హనుమా' లాంటి డైగాల్స్‌తో ట్రైలర్ ఆసక్తికరంగా ఉంది.

## నీహారిక రీ ఎంట్రీ



తెలుగువారికి పరిచయం అక్కరలేని పేరు నిహారిక కొణిదెల. నాగబాబు కూతురుగా వెబ్ సిరిస్‌లతో, గేమ్ షోలతో ఇప్పటికే సుపరిచితమైన ఈ అమ్మడు ఒక మనసు సినిమాతో వెండితెర ప్రవేశం కూడా చేసింది. ఆ తర్వాత మరో రెండు చిత్రాలు చేసి సినిమాలలకు ఫుల్ స్టాప్ పెట్టింది. అనంతరం పెళ్లి చేసుకోవడం, విడాకులు తీసుకోవడం చకచకా అయిపోయాయి. ఆపై నిర్మాతగా మారి ఓటీటీకి వెబ్ సిరీస్, సినిమాలు నిర్మించింది. తాజాగా నిహారికా సినిమాలోకి రీ ఎంట్రీ ఇస్తుండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సోమవారం అమె జన్మదినం సందర్భంగా సిక్స్ సినిమాస్ సంస్థ నిర్మిస్తున్న 'వాట్ ద ఫిష్' చిత్రంలో ఆమె ప్రధాన పాత్ర పోషిస్తున్న అష్టలక్ష్మి అకా ఏయస్ హెచ్ పాత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ ను విడుదల చేశారు. ఇందులో నిహారిక స్టైలిష్ గా నడుస్తూ కనిపించింది. ఈ పాత్రని యూనిక్‌గా డిజైన్ చేసినట్లు దర్శకుడు చెప్పారు. ఈ సినిమాతో వరుణ్ కోరుకొండ దర్శకుడిగా పరిచయమవుతుండగా శక్తికాంత్ కార్తీక్ సంగీతం అందిస్తున్నారు. ఇదిలా ఉండగా 10 నెలల క్రితంమొదటిసారి ఈ సినిమా టైటిల్ ను వాట్ ది ఫిష్ ప్రకటించగా, ఈ యేడాది మే నెలలో మనోజ్ జన్మదినం సందర్భంగా ఫస్ట్ లుక్ తో మరో గ్లింప్స్ విడుదల చేసి 'వాట్ ద ఫిష్' అంటూ సినిమా ట్యాగ్ లైన్ మార్చారు. ఆ తర్వాత వెన్నెల కిషోర్ ఫస్ట్ లుక్ విడుదల చేశారు. మళ్లీ ఇన్నాళ్లకు దాదాపు 6 నెలల తర్వాత నిహారికా ఆన్ ది బోర్డ్ అంటూ ఫస్ట్ లుక్ విడుదల చేయడంతో మరోసారి ఈ సినిమా ట్రెండింగ్ లోకి వచ్చింది. నిహారిక ఫస్ట్ లుక్ విడుదల సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఎక్కడా మంచు మనోజ్ పేరు ప్రస్తావన లేకపోవడం ఇప్పుడు చర్చనీయాంశం గా మారింది. సోషల్ మీడియాల్లోనూ ఎక్కడా ఆయన పేరు కనబడలేదు అఖరుకు చిత్ర నిర్మాతలు మనోజ్ పేరును కూడా ట్యాగ్ చేయకపోవడం వెనకాల మతలబేంటి అనే విషయం తెలియాల్సి ఉంది. ఈ సినిమా నుంచి మనోజ్ ఏమైనా తప్పుకున్నాడా, నిహారికా హీరోయినా లేక ప్రధాన పాత్ర చేస్తుందా, అనే చాలా విషయాలపై క్లారిటీ రావాల్సి ఉంది. పాన్ ఇండియాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని త్వరలో ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి చిత్ర నిర్మాతలు విశాల్ బెజవాడ, సూర్య బెజవాడ సన్నాహాలు చేస్తున్నారు.



## కొత్తవాళ్లతో రాచరికం

చిల్ బ్రోస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై ఈశ్వర్ నిర్మిస్తున్న చిత్రం 'రాచరికం'. విజయ్ శంకర్ హీరోగా, అప్సరా రాణి హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ మూవీకి సురేష్ లంకలపల్లి కథ, కథనాన్ని అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్ కొట్టగా.. నిర్మాత డీఎస్ రావు కెమెరా స్విస్ ఆన్ చేశారు. అనంతరం నిర్మాత ఈశ్వర్ స్క్రిప్ట్‌ను అందజేశారు. ఈ చిత్రానికి వెంగి సంగీతాన్ని అందిస్తుండగా, కెమెరా మెన్ గా ఆర్య సాయి కృష్ణ, జేపీ ఎడిటర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దర్శకుడు సురేష్ లంకలపల్లి మాట్లాడుతూ.. 'చిల్ బ్రోస్ ఎంట్టంల్గ÷న్మెంట్స్ మీద రాచరికం అనే సినిమాను తీస్తున్నాము. ఈ మూవీ గ్లింప్స్ ప్రస్తుతం మంచి రెస్పాన్స్ దక్కించుకుందని,. గ్లింప్స్‌లో వెంగి ఇచ్చిన మ్యూజిక్ బాగుంది. ప్రతీ పాత్రకు ఉందని, నాకు సహకరించిన టీంకు, మా ఈవెంట్‌కు గెస్టులుగా వచ్చిన రాజ్ కందుకూరి, డీఎస్ రావులకు థాంక్స్' అని అన్నారు. నిర్మాత ఈశ్వర్ మాట్లాడుతూ.. 'దర్శకుడు సురేష్‌తో ఆరు నెలలుగా ప్రయాణించామని సినిమా అద్భుతంగా వస్తుందనే నమ్మకం ఉందన్నారు. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్ అందరినీ ఆకట్టుకుంటోందని, సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్ అన్నారు. ఈ మూవీ తరువాత ఇందులో పని చేసిన ప్రతీ ఒక్కరికీ మంచి పేరు వస్తుంది' అని అన్నారు.

# సన్న రకం ధాన్యానికి పెరిగిన డిమాండ్

## రైస్ మిల్లులు, ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటున్న రైతులు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** ఆరుగాలం కష్టపడి పనిచేసే రైతన్నకి ఎట్టకేలకు మంచి రోజులు వచ్చాయి. వానాకాలం సీజన్ లో రైతులు పండించిన సన్న రకం ధాన్యానికి మార్కెట్ లో విపరీతమైన డిమాండ్ ఏర్పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో లభించే మద్దతు ధర కంటే బయటి మార్కెట్ లో ఎక్కువ ధర పలకడంతో రైతులు నేరుగా తమ ధాన్యాన్ని రైస్ మిల్లులకు, ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకోవడానికే మొగ్గు చూపుతున్నారు. రైతులు సన్నరకం వరి ధాన్యం కోసిన వెంటనే వ్యాపారులు నేరుగా పంట పొలాల వద్దకే వెళ్లి తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువ చెల్లించి కొనుగోలు చేస్తుండటంతో రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల వైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం 17 ఉన్న ధాన్యాన్ని విక్రయిస్తే ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, కామన్ ధాన్యానికి రూ.2,183 మద్దతు ధర లభిస్తోంది. దీనికి తోడు క్వింటాలుకు 3 నుంచి 5 కిలోల తరుగు ఉండటంతో రైతులు ప్రైవేట్ వ్యక్తులకే ధాన్యం అమ్ముకుంటున్నారు. ప్రైవేట్ వ్యక్తులు ధాన్యం రకాన్ని బట్టి రూ.2,400 నుంచి రూ.3,500 వరకు పలుకుతోంది. సన్న రకం వరి ధాన్యాలు అయిన 1061, 1064, 1224, 1262, 1271, 1318, 7029, 24423, ఆర్ ఎన్ ఆర్, ఎచ్ ఎంటీ సోన, బీపీటీ 5204 వంటి రకాలకు రూ.2,400 నుంచి రూ.3,200 ధర చెల్లిస్తున్నారు. గరిష్టంగా ఆర్ ఎన్ ఆర్ రకానికి రూ.3,200 మద్దతు ధర లభిస్తోంది. ఎటువంటి తరుగులు తీయక పోవడం, తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోళ్లు చేస్తుండటంతో పాటు పరదాల ఖర్చు, హమాలీ ఖర్చు తప్పడంతో రైతులు మొత్తం సన్నరకం ధాన్యంను ప్రైవేట్ వ్యక్తులకే అమ్ముకుంటున్నారు. సన్న రకం వరి ధాన్యానికి డిమాండ్ రావడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

# ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా దాసరి హరిచందన



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం మరో ఇద్దరు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఆయుష్ డైరెక్టర్ దాసరి హరిచందనను మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ గా నియమించింది. దీంతో పాటు ప్రజావాణికి స్టేట్ నోడల్ ఆఫీసర్ గా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ శాంత కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ సెక్రటరీగా ఉన్న ఐఏఎస్ కె.నిర్మలను జీఏడీలో సర్వీసెస్, జీపీఎం, ఏఆర్టీలో నియమించారు. ప్రజావాణిలో పొన్నం బేగంపేటలోని ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించి ప్రజావాణి కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రజలనుంచి వచ్చిన వినతులను స్వీకరించారు.

# త్వరలో 14 వేల అంగన్‌వాడీ ఖాళీల భర్తీ

## ములుగుకు బీఈడీ, ఇంజనీరింగ్ కాలేజీ
## పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క




**వరంగల్ వాయిస్, ములుగు :** ఆరోగ్యవంతమైన, విజ్ఞానవంతమైన సమాజం ఏర్పడినప్పుడు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. ములుగులోని డిగ్రీ కళాశాల సమీపంలో రూ.కోటి 34 లక్షల వ్యయంతో నిర్మించనున్న బాలసదనం భవనానికి ఆమె శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల బాలింతల విభాగంలో తల్లిపాల విభాగాన్ని ప్రారంభించారు. ఇదే ఆవరణలో జరిగిన కార్యక్రమంలో దివ్యాంగులు, అంగన్‌వాడీలకు ఉపకరణాలను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 14 వేల అంగన్‌వాడీ ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. తొలి ప్రాధాన్యంగా నాలుగు వేల మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసి టీచర్ల జీతాన్ని రూ.7,500 నుంచి రూ.13 వేలకు పెంచినట్టు తెలిపారు. కేజీబీవీ, గురుకుల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. ములుగులో బీఈడీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. రామప్ప దేవాలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్న సీతక్క రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రసాద్ పథకంలో భాగంగా సైట్–ఏలోని పదెకరాల్లో రూ.61.99 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులు, నిర్మాణాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. జూన్‌లోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.




# రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీల్లో.. గొర్రెకుంట విద్యార్థుల ప్రతిభ

**వరంగల్ వాయిస్, గొర్రెకుంట :** ఈనెల 17, 18 తేదీల్లో తొర్రూర్ పట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి బేస్ బాల్ (17సంవత్సరాల విభాగం) పోటీలో గొర్రెకుంట పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వరంగల్ బాలుర జట్టు తరుపున పాల్గొన్న ఎల్.అక్షిత్, బి.శ్రీచరణ్ చాంపియన్‌షిప్ సాధించడంలో ప్రధాన భూమిక నిర్వహించారు. అదేవిధంగా బాలికల విభాగంలో బి.నందిని అత్యంత ప్రతిభ కనబర్చి బ్రాంజ్ మెడల్ సాధించారు. వారి క్రీడా ప్రతిభతో వరంగల్ బాల, బాలికల జట్లను విజయపథంలో నడిపించి పతకాలు సాధించిన ఎల్.అక్షిత్, బి.శ్రీచరణ్, బి.నందినిలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.జ్యోతిర్మయి, 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల మనోహర్, ఎస్ఎంసీ చైర్మన్ జున్ను కుమారస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు షాహీన్ సుల్తానా, ఎం.చంద్రశేఖర్, మార్త శ్రీనివాస్, సీహెచ్.అనిత, పి.ప్రణతికుమారి, జె.దమరి, పీఈటీ జలగం రఘువీర్, సీహెచ్.శ్రీదేవి, ఆర్.రాజు, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

# పనుల్లో వేగం పెంచండి

## పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
## బల్దియా కమిషనర్‌తో కలిసి అభివృద్ధి పనులపై సమీక్ష

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలో పలు పథకాల కింద కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయ సమావేశ మందిరంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషాతో కలిసి మున్సిపల్, కుడా, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో స్మార్ట్ సిటీ, జనరల్ ఫండ్ తదితర పథకాల కింద కొనసాగుతున్న, చేపట్టనున్న అభివృద్ధి పనులపై సమీక్షించి ఆయా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కాళోజి కళాక్షేత్రం నిర్మాణ పనుల పురోగతి, భద్రకాళి మాడవీధుల ప్రగతి గురించి అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కుడా ప్రాజెక్టు అధికారి అజిత్ రెడ్డి, భీమ్ రావు, సెక్రటరీ మురళి, జీడబ్ల్యూఎంసీ ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, కృష్ణారావు, సిటీ ప్లానర్ వెంకన్న, ఆర్డీవో రమేష్, స్మార్ట్ సిటీ పీఎంఈ ఆనంద్ వోలెటి, రెవెన్యూ పోలీస్ మున్సిపల్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదుకు మరో అవకాశం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కొత్తగా ఓటరుగా పేరు నమోదు చేసుకునే వారికి ఎన్నికల కమిషనర్ మరో అవకాశం కల్పించింది. లోక్‌సభతో పాటు పలు ఎన్నికల సందర్భంగా 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండే వారికి ఓటు హక్కు కల్పించాలని నిర్ణయించారు. అదే విధంగా ఈ నెల 20 నుంచి ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు కూడా అవకాశం కల్పించారు. ఇందుకు గాను శని, ఆదివారాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఫిబ్రవరి 8న తుది జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.





# మంత్రిని కలిసిన బండి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుని పీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com